'నాంపల్లిలో రౌడీషీటర్ల ఆటలు సాగనివ్వం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్

గోల్కొండ: నాంపల్లి నియోజకవర్గంలో రౌడీషీటర్ల ఆగడాలు మితిమీరిపోతున్నాయని వారి ఆటలు సాగనివ్వమని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుసేన్ అన్నారు. మంగళవారం ఆయన మెహిదీపట్నంలో నాంపల్లి కాంగ్రెస్ నాయకుడు ఫిరోజ్‌ఖాన్, అతడి అనుచరులపై తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హత్యా, హత్యా ప్రయత్నం, మామూళ్ల వసూళ్లు తదితర విషయాలపై వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదై ఉన్న వారిని ఫిరోజ్‌ఖాన్ వెంట వేసుకొని నాంపల్లిలో కాంట్రాక్టర్లను, బల్దియా అధికారులను బెదిరిస్తూ మామూళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. ఐఎస్‌సదన్‌కు చెందిన అష్రఫ్, మంగల్‌హాట్‌కు చెందిన ఆబిద్, షేక్ సాలే క్రిమినల్ రికార్డులు ఉన్న వారు అని వీరిని వెంటపెట్టుకొని ఫిరోజ్‌ఖాన్ కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నాడని ఆయన ఆరోపించారు. నాంపల్లి నియోజకవర్గానికి చెందిన కాంట్రాక్టర్లు రౌడీషీటర్ల జులుంపై పోలీసులకు ఫిర్యాదు చేశారని, ఈ ఫిర్యాదులో బల్దియాకు చెందిన ఇద్దరు ఇంజినీరింగ్ అధికారులు సాక్షులుగా సంతకాలు కూడా పెట్టారని ఆయన పేర్కొన్నారు.

'డబుల్' ఇళ్ల కోసం స్థలాన్ని ఇచ్చిన బాధితులకు పట్టాలివ్వాలి

చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్ రవీంద్రనాయక్‌నగర్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం స్థలాన్ని ఇచ్చిన 72 మంది బాధిత కుటుంబాలకు వెంటనే పట్టాలివ్వాలని సీపీఎం పార్టీ జంగమ్మెట్ డివిజన్ కార్యదర్శి ఎ.కృష్ణా నాయక్ కోరారు. ఈ మేరకు బండ్లగూడ ఇన్‌చార్జి తహసీల్దార్ రాధికను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పదేళ్ల క్రితం ఎంసీహెచ్ క్వార్టర్స్‌లో ఉన్న 72 మంది ఇళ్లను ఖాళీ చేయించి అందులో డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించారన్నారు. అందులోకి షిఫ్ట్ అయిన ఆ 72 కుటుంబాలకు వెంటనే అధికారికంగా పట్టాను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషన్, రాం కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనులు సకాంలో పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులదేనని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన బల్దియా కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన గోల్కొండ, టోలిచౌకీ, నానల్‌నగర్ డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కొత్త పనులపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లతో పనులను సకాలంలో అధికారులు పూర్తి చేయించడం లేదని, దీన్ని వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. టోలిచౌకీ–టూంబ్స్ రోడ్డుపై సంవత్సర కాలంగా పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయని, అదే విధంగా టోలిచౌకీ చౌరస్తా, ఎండిలైన్స్, మోతీ దర్వాజా, నానల్‌నగర్ తదితర ప్రాంతాల్లో సైతం అభివృద్ధి పనులు నెలల తరబడి జరుగుతున్నా పూర్తి కావడం లేదన్నారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఈ వెంకటసాయి, ఏఈ ఉదయ్‌కుమార్, మజ్లిస్ నాయకులు వజీఉజ్జమా తదితరులున్నారు.

గాంధీ వారసత్వాన్ని కాపాడాలి

గన్‌ఫౌండ్రీ: ఉత్తర ప్రదేశ్ బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి పేరిట వారణాసిలోని గాంధీ సామాజిక సేవా సంస్థ, అఖిల భారత సర్వసేవా సంఘ్‌లకు చెందిన 12 వారసత్వ భవనాలను కూల్చివేయడం దుర్మార్గమని అఖిల భారత సర్వ సేవా సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ షేక్ హుస్సేన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం గాంధీభవన్ వద్ద గల తెలంగాణ సర్వోదయ మండలి కార్యాలయంలో గాంధీజీ వారసత్వాలను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ కొవ్వొత్తులు వెలిగించి మౌనప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహాత్మా గాంధీ ఆలోచనలు, తత్వాలను ప్రచారం చేయడానికి 1948లో ఆచార్య వినోభా ఆ కట్టడాలను నిర్మించినట్లు వెల్లడించారు. అభివృద్ధి పేరిట ప్రముఖుల విలువైన సాహిత్య వారసత్వాన్ని ధ్వంసం చేయడం సరికాదన్నారు. మాజీ ఎంపీ అజీజ్‌పాషా మాట్లాడుతూ..గాంధీ వారసత్వాన్ని లాక్కోవడానికి, నాశనం చేయడానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షుడు ఆర్.శంకర్‌నాయక్, ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్, యువజన విభాగం అధ్యక్షులు భాస్కర్, మహిళా విభాగం అధ్యక్షురాలు యాదమ్మ పాల్గొన్నారు.



కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలుపుతున్న సర్వోదయ మండలి ప్రతినిధులు

వాటర్స్‌వర్క్స్ ఎంప్లాయీస్‌కు పదోన్నతులు కల్పించాలి



సమావేశంలో సీజీఎం వినోద్ భార్గవ్‌కు వివరిస్తున్న రాంబాబు యాదవ్ తదితరులు

అబిడ్స్: వాటర్‌వర్క్స్‌లో జనరల్ పర్పస్ ఎంప్లాయీస్‌కు చేరిన వారికి జీవితాంతం పదోన్నతులు లభించక అదే పదవిలో పదవీ విరమణ చేస్తున్నారని వాటర్‌వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ గుర్తింపు సంఘం అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.లక్ష్మీనారాయణ, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ బి.కొమురయ్య ఆవేదన వ్యక్తం చేశారు. వాటర్‌వర్క్స్ ఒకటవ సర్కిల్ సీజీఎం వినోద్ భార్గవ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి పదోన్నతులను వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..జీపీ ఉద్యోగులకు పదోన్నతులు లభించక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారందరి విన్నపం మేరకు జీపీ ఉద్యోగులకు ఎస్‌పీ ఉద్యోగులుగా, ఎస్‌పీ ఉద్యోగులకు టెక్నికల్ గ్రేడ్–2గా పదోన్నతులు కల్పించాలని వారు సీజీఎంకు విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా పదోన్నతులు కల్పించాలన్నారు.

కనీస వసతులు కల్పించాలి

లంగర్‌హౌస్: దసరా, బతుకమ్మ ఉత్సవాలకు మహిళల కోసం కనీస వసతులు కల్పించాలని లంగర్‌హౌస్ దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బోగి బాలరాజ్ అన్నారు. లంగర్‌హౌస్‌లో ఉత్సవాలకు ఎలాంటి వసతులు కల్పించడంలేరని, అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ ఆయన డీఎంసీ శశిరేఖను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాంలీలా మైదానం, లంగర్‌హౌస్ చెరువు వద్ద బతుకమ్మ సంబరాలకు వచ్చిన మహిళలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆ ప్రాంతాల్లో దసరా, బతుకమ్మ సంబరాల సందర్భంగా సంచార మూత్రశాలలు ఏర్పాటు చేయాలన్నారు. గంటల తరబడి జరిగే ఉత్సవాల సందర్భంగా తాగునీరు కూడా అధికారులు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట ఎంఐఎం నాయకుడు మాజీద్ ఉన్నారు.



డీఎంసీకి వినతిపత్రం అందజేస్తున్న బాలరాజ్

ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలి

అఫ్జల్‌గంజ్: వాటర్‌బోర్డులో యాన్యువల్ మెయింటెనెన్స్ సెక్షన్ టెండర్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ జేఏసీ ఏరియా ఇన్‌చార్జి పోల్కం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వాటర్‌బోర్డు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తలపెట్టిన ఈ విధానంతో వందలాది మంది కాంట్రాక్టర్లు రోడ్డుపాలయ్యాయన్నారు. వాటర్‌బోర్డు ఎండీ వెంటనే ఈ విధానాన్ని రద్దు చేసి గతంలో మాదిరిగా చిన్నా చితకా కాంట్రాక్టర్లకు పనులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇర్ఫాన్, ఇమ్రాన్, ముస్తఫా, మహ్మద్ రషీద్, వీరేందర్, వాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న పోల్కం శ్రీనివాస్, ఇర్ఫాన్, ఇమ్రాన్ తదితరులు

మహాలక్ష్మీ.. నమోస్తుతే

చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల పరిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మంగళవారం ఆలయాలు, మండపాల్లో కొలువుదీరిన అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారు రోజుకో రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆరో రోజు అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు.

– చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల బృందం




మహా లక్ష్మీదేవిగా జియాగూడ మహంకాళి



మహా లక్ష్మీదేవిగా ఉప్పుగూడ అమ్మవారు



మీరాలంమండిలో..



మహాలక్ష్మీగా ముక్కెర బస్తీ నల్లపోచమ్మ



కాత్యాయినీ దేవిగా లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారు



గుడిమల్కాపూర్‌లో..



సంజయ్‌నగర్ నల్లపోచమ్మ ఆలయం వద్ద..



టోలిచౌకీ అక్బర్‌పురాలో..



రాష్ట్ర బీజేపీ నాయకురాలు బండారి రాధిక, శ్రీధర్‌ను సత్కరిస్తున్న దృశ్యం



భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న సెట్విన్ ఎండీ వేణు గోపాల్ రావు కుంటుంబ సభ్యులు



భాగ్యలక్ష్మి అమ్మవారి పూజల్లో మాజీ ఎమ్మెల్యే విశ్వనాథ్ బాబురావు, డాక్టర్ నాగ్‌నాథ్ మాశెట్టి



పూజల్లో మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర



ధూల్‌పేట్‌లో..రాష్ట మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్



ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో విజేత తనిష్‌కు అవార్డు అందజేస్తున్న చీఫ్ కన్వీనర్ గోవిందరాటి తదితరులు



సాయి వాసవి సేవా సంస్థ ఆధ్వర్యంలో..



విజయనగర్‌కాలనీ లక్ష్మీ గణపతి ఆలయంలో..



గుడిమల్కాపూర్‌లో బీజేపీ నాయకులు



పూజల్లో బీజేపీ నాయకుడు దేవర వంశీ తదితరులు

త్వరలోనే పెండింగ్ సమస్యలు పరిష్కారం

నాంపల్లి: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలన్నీ త్వరలోనే పరిష్కారం అవుతాయని టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం టీఎన్జీఓ కేంద్ర సంఘం ఆధ్వర్యంలో నాంపల్లిలో గాంధీభవన్ హైస్కూల్ ఆవరణంలో బతుకమ్మ సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన మారం జగదీశ్వర్ మాట్లాడుతూ.. ఉద్యోగులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగానే ఉందన్నారు. దీపావళి పండుగ లోపు పెండింగ్ సమస్యలు నెరవేరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వ ఉద్యోగులు ఒకరోజు వేతనాన్ని అందజేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు బతుకమ్మను ఆడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం సహాధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ, నాల్గవ తరగతి అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం జ్ఞానేశ్వర్, కొందూరు గంగాధర్ పాల్గొన్నారు.

వ్యాపార సముదాయాల కూల్చివేత



నాంపల్లి: నోబుల్ టాకీస్ చౌరస్తాలో రోడ్డు విస్తరణలో భాగంగా పలు వ్యాపార సముదాయాలను జీహెచ్ఎంసీ అధికారులు తొలగించారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఇక్కడి వ్యాపారస్తులకు జీహెచ్ఎంసీ నష్టపరిహారం చెల్లించింది. నష్టపరిహారం చెల్లించి ఏళ్లు గడుస్తున్నా వ్యాపార సముదాయాలను ఖాళీ చేయకుండా అలాగే ఉన్నారు. కోర్టు ఆదేశాల మేరకు సర్కిల్–12 టౌన్‌ప్లానింగ్ అధికారులు మంగళవారం ఉదయం రెండు ప్రొక్లెయిన్లతో అక్కడకు చేరుకున్నారు. ప్రజా రవాణాకు తీవ్ర అంతరాయాన్ని కలిగిస్తున్న వ్యాపార సముదాయాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా అక్కడ గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు



యాకుత్‌పురా: డ్రైనేజీ సమస్యలు అరికట్టేందుకు జలమండలి చేపట్టిన 90 రోజుల్లో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ప్రత్యేక వాహనాన్ని తలాబ్ చంచలం కార్పొరేటర్ సమీనా బేగం మంగళవారం అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..డ్రైనేజీ పైప్‌లైన్‌లు నిండిపోయి మురుగు నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో అన్ని ప్రాంతాల్లో నిర్వహించాలని అధికారులను కోరారు. స్థానిక మజ్లిస్ నాయకులు, జలమండలి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..



కోఠి డీఎంహెచ్‌ఎస్‌లో బతుకమ్మ ఆడుతున్న వైద్య శాఖ ఉద్యోగులు



మున్సిపల్ సహకార్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

సుల్తాన్‌బజార్: టీఎన్జీఓస్ డీఎంహెచ్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం కోఠి డీఎంహెచ్ఎస్ క్యాంపస్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు బతుకమ్మను ఆడారు. ముఖ్య అతిథిగా టీఎన్జీఓ సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు మారం జగదీశ్వర్ హాజరై మాట్లాడారు. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకా అని అన్నారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీంద్ర నాయక్, అధికారులు శ్వేతామొంగ, శ్రీకాంత్, క్రాంతి చక్రి, ప్రభాకర్ పాల్గొన్నారు.

మున్సిపల్ సహకార్ ఆధ్వర్యంలో..

అబిడ్స్: మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ జీహెచ్ఎంసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న జీహెచ్ఎంసీ కార్యాలయంలో వద్ద దాదాపు 300 మంది ఉద్యోగులు, సిబ్బంది ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సందేశాత్మక చిత్రాలు రావాలి

గన్‌ఫౌండ్రీ: సందేశాత్మక చిత్రాలు రావాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. సెల్ఫ్ ఫ్యాక్టరీ, వరంగల్ వాయూల ఆధ్వర్యంలో నిర్మించిన టెన్‌టైమ్స్ లఘుచిత్రాన్ని మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. మనం ఒకరికి సహాయం చేస్తే అది పదింతలై తిరిగి వస్తుంది. అనే సందేశాంతో నిశబ్ద రూపంలో చిత్రాన్ని నిర్మించిన సాంకేతిక నిపుణులు, నటీనటులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత చొక్కాపు వెంకటరమణ, సినీనటుడు బాలాజీ, రవళి, అనిత తదితరులు పాల్గొన్నారు.



లఘుచిత్రాన్ని ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి తదితరులు

సరోజినీదేవికి సత్కారం

నాంపల్లి: ప్రముఖ సంఘ సేవకురాలు, కె.లింగమయ్య అలియాస్ ఇడ్లీ లింగం సతీమణి కె.సరోజినీదేవిని రామచంద్ర హనుమాన్‌జీ ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం సత్కరించారు. ఇటీవల కొలువుదీరిన ఆలయ కమిటీ నూతన కార్యవర్గం ఆలయానికి సహాయం చేసిన వారిని గుర్తించి సత్కరిస్తున్నారు. ఇందులో భాగంగా సరోజినీదేవిని ఆలయానికి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ నరేందర్, సభ్యులు పాండు, సంజీవ్, శ్రీనివాస్, బస్తీ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, ఏ బ్లాక్ అధ్యక్షుడు జి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సరోజినీదేవిని సత్కరిస్తున్న నరేందర్, శ్రీశైలంయాదవ్

నేడు మాతారాణి చౌకి జాగరణ్



జియాగూడ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాంపురా సత్తెన్నగల్లీ శంకర్‌జీ హనుమాన్‌జీ అయ్యప్పస్వామి ఆలయ ప్రాగణంలో ఈనెల 9న రాత్రికి మాతారాణీకా చౌకి జాగరణ్ భారీ ఎత్తున నిర్వహిస్తున్న చౌకి కన్వీనర్ వర్ధ జ్ఞానేశ్వర్, చైర్మన్ జీఎస్ ప్రకాష్‌రావు, వైస్ చైర్మన్ గొడిశాల నరేష్‌గౌడ్, అధ్యక్షుడు కె.మోహన్‌గౌడ్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ ముదిరాజ్, కోశాధికారి పి.ఐలెన్‌గౌడ్ సలహాదారులు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆలయంలో జాగరణ్ బ్రోచర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్లు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవింద్‌రావ్, బాల్‌రాజ్ గౌడ్, ప్రమోద్ గోపిశెట్టి, రామ్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అగ్నివీర్‌పై అవగాహన

విజయనగర్‌కాలనీ: అగ్నివీర్ వాయు రిక్రూట్‌మెంట్‌పై బుధవారం నిరుద్యోగ యువత కోసం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం అధికారి జి.జయశ్రీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ విద్యార్హత గల నిరుద్యోగులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు బుధవారం ఉదయం 10.30 గంటలకు ఫొటోలు, ధ్రువీకరణ పత్రాలతో విజయనగర్‌కాలనీలోని రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నేరుగా హాజరు కావాలన్నారు.

అవార్డు ప్రదానం

సుల్తాన్‌బజార్: నవదుర్గ నవరాత్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో చాదర్‌ఘాట్ విక్టరి ప్లేగ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 65 అడుగుల దుర్గామాత విగ్రహం ప్రపంచంలోనే అతిపెద్ద విగ్రహం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకునేందుకు తరలి వస్తున్నారు. ఈ మేరకు హై రేంజ్ బుక్ ఆఫ్ రికార్డు వారు 6వ సారి వరల్డ్స్ టాలెస్ట్ ఈకో ఫ్రెండ్లీ పేరిట అవార్డును త్రిదండి రామానుజ జీయర్‌స్వామి సమక్షంలో నవదుర్గ నవరాత్రి ఉత్సవ సమితి వ్యవస్థాపకుడు గులాబ్ శ్రీనివాస్‌కు ప్రదానం చేశారు.



అవార్డును ప్రదానం చేస్తున్న హై రేంజ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు

ఎమ్మెల్యేకు ఆహ్వానం

లంగర్‌హౌస్: గోల్కొండ కోటలో నిర్వహించే దసరా, దాండియా ఉత్సవాల్లో ప్రముఖులు విచ్చేయనున్నారని గోల్కొండ దసరా ఉత్సవ కమిటీ ప్రధానకార్యదర్శి శోభాపాండే అన్నారు. ఆమె మంగళవారం ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్‌ను కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శోభాపాండే మాట్లాడుతూ.. గోల్కొండ కోట లోపల జరిగే దసరా వేడుకలకు ప్రముఖులు విచ్చేయనుండగా చుట్టుపక్కల మండలాల ప్రజలు కూడా పెద్దయెత్తున ప్రతి సంవత్సరం వస్తుంటారన్నారు. ఈ సంవత్సరం ప్రముఖ సంఘ సేవకుడు రాజు వస్తాద్ ఆధ్వర్యంలో వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆమె వెంట విశ్వజిత్‌సింగ్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే కౌసర్‌ను ఆహ్వానిస్తున్న ప్రధాన కార్యదర్శి శోభాపాండే

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన



జియాగూడ: బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన వస్తోందని జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. మంగళవారం ఇమాంపురాలో డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటైన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరై ప్రారంభించారు. గోల్కొండ జిల్లా కో కన్వీనర్ శివకుమార్‌యాదవ్, రాంకుమార్, కమలబాయి, మాధవి, రేవతి, బాబురావు, శ్రవణ్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు

అబిడ్స్: హరియాణాలో బీజేపీ విజయం సాధించడంతో అబిడ్స్ కట్టెల మండి బీజేపీ కార్యాలయం వద్ద రాష్ట్ర బీజేపీ కార్యాలయ కోఆర్డినేటర్ డి.గోపాల్‌జీ, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్‌రాథోడ్, శాంతికుమార్, చంద్రశేఖర్ మిఠాయిలు తినిపించి సంబరాలు చేశారు.



వ్యక్తి అదృశ్యం

గౌలిపురా: వ్యక్తి అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం ..తలాబ్‌కట్టా సమద్ హోటల్ ప్రాంతానికి చెందిన సనా బిన్ మహపూస్, షహబాజ్ ఖాన్ (27)లు దంపతులు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ నెల 4న ఉదయం 11 గంటలకు షహబాజ్ ఖాన్ పిల్లలకు స్నాక్ తీసుకొస్తానని బయటికి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆందోళన చెందిన భార్య సనా స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



షహబాజ్ ఖాన్ (ఫైల్)